రూ.30 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - అనంతగిరి : అనంతగిరి మండలం వాలాసి పంచాయితీ గొర్రె గుమ్మి గ్రామంలో సర్పంచ్ సేంబీ.సన్యాసిరావు అధ్యక్షతన 30 లక్షల నిధులతో శంకుస్థాపన ముఖ్య అతిథులుగా అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు, ఎంపీపీ శ్రీమతి శెట్టి నీలవేణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ వాలాసి పంచాయితీ గొర్రె గుమ్మి గ్రామం దీర్ఘకాలంగా రోడ్డు లేక ఆయా ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ ఉండేవారు. 30 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం చేయడం వలన ప్రజలకు ఇబ్బందులు తొలగిపోతున్నాయి. ఈ కార్యక్రమంలో వాలాసి పంచాయితీ సర్పంచ్ సేంబీ.సన్యాసిరావు, మాజీ జడ్పిటిసి దూరు గంగన్నదొర, మాజీ సర్పంచ్ బాక గురుమూర్తి, మాజీ సర్పంచ్ కేరంగి ధర్మన్న, బోయిన లచ్చన్న లంగుపర్తి సర్పంచ్ సన్యాసిరావు, మాజీ వైస్ సర్పంచ్ నేగెల సుందర్ రావు బాక నగేష్, పంచాయితీ రాజ్ జే.ఇ.సాయి విజాయ్, సీతారామ్, అశోక్ ప్రజలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై ఏపీ ఎఫ్‌డీసీ యాజమాన్యం స్పందించాలి

యాజమాన్యానికి కాఫీ కార్మికుల హెచ్చరిక

విశాలాంధ్ర - చింతపల్లి : రెండు దశాబ్దాలుగా కాఫీ తోటలో పనిచేస్తూ కూలి రేట్లు, కాఫీ పళ్ళ రేట్లు పోరాడి సాధించుకోవడం తప్ప యాజమాన్యం తమ బాగోగులు పట్టించుకోలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఐదు డివిజన్ల పరిధిలో పాడేరు, చింతపల్లి, ఆర్ వి నగర్ లలో పనిచేస్తున్న కార్మికులు ప్లాంటేషన్ లేబర్ చింతపల్లిలో సమావేశమయ్యారు. 2002 నుంచి కార్మికుల పోరాటం ఫలితంగా కూలి రేట్లు కేజీ కాఫీ పళ్ళు రేట్లు పెంచుకోవడం జరిగిందన్నారు. ఆ రోజున్న, కేజీ పళ్ళు ధర కిలో రూపాయి 20 పైసలు కాగా, రోజు కూలి, 63 రూపాయలు ఉండేదని, ప్రస్తుతం, కేజీ పళ్ళు, 5రూ, రోజు కూలి 320 రూపాయలు ఇస్తున్నారని, లేబర్ కమిషనర్ వీడియో పాయింట్లు ద్వారా చెప్పారన్నారు. ప్రస్తుతం ఏపీ ఎఫ్‌డిసి కాఫీ తోటల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. ఈ పరిస్థితిని పట్టించుకునే నాధుడు కరువయ్యాడని వాపోయారు, ఫీల్డ్ ఆఫీసర్లు, రేంజర్లు, సూపర్వైజర్లు, మొత్తం కలిపి వంద మంది పైగా సిబ్బంది ఉండేవారని, ప్రస్తుతం ఐదుగురు రేంజర్లు, 18 మంది ప్లాంటేషన్ వర్కర్లతోనే అన్ని పనులు చేయిస్తున్నారని, అది తమకు భారంగా ఉందని, ప్లాంటేషన్ వర్కర్లు లబోదిబో మంటున్నారన్నారు, ఇచ్చే వేతనం 10 వేలు మాత్రమేనని, అది వాహనాలకు పెట్రోల్ వేసుకొని తిరగడానికి సరిపోతుందని, కుటుంబాలు ఎలా గడుస్తాయని యాజమాన్యాన్ని ప్రశ్నించారు, ప్లాంటేషన్ వర్కర్ కింద,తోటలు సంరక్షణ కోసం, ఒకరు లేక ఇద్దరినీ నియమించుకుంటే,వారికి రోజు కూలీ లెక్కనే ఇవ్వాల్సి ఉంటుందని, వారు తోటలు సంరక్షణకు రావడానికి వెనుకడుగు వేస్తున్నారని, తమకు రోజు కూలి గిట్టదని నిలదీస్తున్నారన్నారు. కాఫీ కార్మికులు ఉన్న క్వార్టర్లు అసలు మరమ్మతులే చేయలేదని, కార్మికులకు తోటలలో ప్రమాదం జరిగితే పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితులు సమస్యలు ఉన్నప్పటికీ కాఫీ ఏపీ ఎఫ్‌డిసి యాజమాన్యం కనీసం స్పందించలేదన్నారు, ఇప్పటికైనా యాజమాన్యం స్పందించకపోతే సిఐటియు, ఏఐటీయూసీ, సహకారంతో సమ్మెకు సైతం వెనకాడబోమని హెచ్చరించారు, ఈ నెల 15న అన్ని డివిజనల్ మేనేజర్లకు సమస్యలతో కూడిన సమ్మె నోటీసు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు, బోనంగి చిన్నయ్య పడాల్, ఏఐటీయూసీ, జిల్లా కోకన్వీనర్,అమర్, కాఫీ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎల్ సుందర్రావు, పూర్వ జిల్లా కార్యదర్శి, సిపిఎం పార్టీ గాలికొండ ఎంపీటీసీ, అంపురంగి బుజ్జిబాబు, కాఫీ కార్మిక సంఘం జిల్లా ఇన్చార్జ్, గడుతూరి సత్యనారాయణ, ప్లాంటేషన్ వర్కర్స్, రాజారావు, దేవరాజ్, మోరి గిరి, బొబ్బిలి పాపారావు, ఆర్ముగం, రాజు, కాంతారావు, మూడు డివిజన్‌లలో పనిచేస్తున్న కార్మికులు, ప్లాంటేషన్ వర్కర్లు హాజరయ్యారు.

మనోహర్ పై పోలీసు కేసు నమోదు : కాకరి మోక్షితను బాలల సదనంలో చేర్పించిన పీఓ

విశాలాంధ్ర బ్యూరో- పాడేరు : హుకుంపేట మండలం దొంతురాయి గ్రామానికి చెందిన కాకరి ప్రమీల కుమార్తె మైనర్ బాలిక మోక్షిత దేవి (9) ని రాజమండ్రి తరలించి ఇంటిలో పనులు చేయిస్తున్న శెట్టి మనోహర్ పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఐటిడి ఏ పి. ఓ వి. అభిషేక్ పేర్కొన్నారు. గిరిజన బాలికలను అక్రమంగా తరలించి పనులు చేయిస్తున్న వారిపై చర్య తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆయన సోమవారం ఆదేశించారు. ఐసిడి ఎస్ పి.డి. ఎన్. సూర్యలక్ష్మి అందించిన వివరాల మేరకు మోక్షిత దేవి దొంతురాయి గ్రామం ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతోందని రెండు నెలల క్రితం మనోహర్ బాలికను వెంట తీసుకుని వెళ్లి రాజమండ్రి లోని తన ఇంట్లో చాకిరీ చేయించడంతో బాలిక తప్పించుకుని గోదావరి వంతెనపై నడిచి వెళ్లడం గమనించిన ఒక వ్యక్తి తీసుకుని వెళ్లి రాజమండ్రిలో పోలీసులకు అప్పగించారని అన్నారు. రాజమండ్రి పోలీసులు అందించిన సమాచారం మేరకు రంపచోడవరం సిడిపి ఓ సంధ్యారాణి, అడ్డతీగల సిడిపిఓ సుధ రాజమండ్రి పంపించామని అన్నారు. సిడిపి ఓలు బాలికలను తీసుకుని వచ్చి పాడేరు ఐసిడి ఎస్ పి.డి. సూర్యలక్ష్మికి శనివారం అప్పగించారు. సోమవారం బాలికలను ఐసిడి ఎస్ అధికారులను ఐటిడి ఏ కు పిలిపించి ప్రాజెక్టు అధికారి బాలికతో మాట్లాడి రాజమండ్రి ఎందుకు వెళ్లావు, ఎలా వెళ్లావు, ఎలా తప్పించుకుని బయట పడ్డావని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటికి వెళతావాని బాలికను ప్రశ్నించారు. ఇంటికి వెళ్లడానికి నిరాకరించడంతో బాలల సదనంలో చేర్పించాలని ఐసిడి ఎస్ అధికారులను ఆదేశించారు. వెంటనే బాలికకు కొత్తబట్టలు కొని ఇచ్చి ఐసిడిఎస్ అధికారుల బాలల సదనంలో చేర్పించి విద్యను అందించాలని ఆదేశించారు. స్థానిక సి. ఐ. తో ఫోన్లో మాట్లాడి బాల కార్మిక చట్టం కింద కేసు నమోదు చేసి నిందుతులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విశాఖ పట్నం వైల్డ్ వెలేర్ కమిటీ అధ్యక్షులతో మాట్లాడి బాలికను బాలల సదనం లో చేర్పించడానికి అనుమతులు జారీ చేయాలని కోరారు. రెండు నెలలుగా బాలిక పాఠశాలకు గైరుహాజరైనా పట్టించుకోని దొంతురాయి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడుకి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని డి.ఇ.ఓ బ్రహ్మాజీని ఆదేశించారు. రెండు రోజులు విద్యార్థులు పాఠశాలలకు రాకపోతే వెంటనే సమాచారం తెలుకుని ఉన్నాతాధికారులకు తెలియజేయాలని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు సర్క్యులర్ జారీ చేయాలని సూచించారు.

ఉపాధి పనుల గుర్తింపునకై గ్రామసభ

విశాలాంధ్ర - దుంబ్రిగుడ : ఉపాధి హామీ పథకంలో భాగంగా పనుల గుర్తింపుకు ఖంద్రుమ్ పంచాయతీ కేంద్రంలో స్థానిక ఆ పంచాయతీ సర్పంచ్ కే హరి ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈగ్రామ సభలో 2024-2025 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులు మట్టి కట్టలు, భూమి చదును, రాతి కట్టలు, ఖండిత కంద కాలువ పనులు కొరకు తీర్మానం చేసినట్లు సర్పంచ్ హరి తెలిపారు. అనంతరం ఆ పంచాయతీలో పనిచేస్తూ బదిలీ అయిన సచివాలయ కార్యదర్శి గోవిందరావుకు ఆ పంచాయతీ సచివాలయ సిబ్బంది, నాయకులు, వార్డు సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్రావు,ఉప సర్పంచ్ కె.ప్రతిమ, మాజీ సర్పంచ్ కిలో ఆనంద్, పంచాయతీ కార్యదర్శి గోవిందరావు, వెటర్నరీ అసిస్టెంట్ శెట్టి.జయరాజు, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ పోర్తిమ్మ, మాజీ సర్పంచ్ కే.ఆనందరావు, పాలక వార్డు సభ్యులు, సచివాలయం సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న సెక్రటరీని సన్మానించిన కొత్తపాలెం గ్రామస్తులు

విశాలాంధ్ర - జీకే వీధి : లక్క వరపు పేట పంచాయతీ కార్యదర్శిగా పనిచేసే బదిలీపై వెళ్తున్న బాలకృష్ణను పంచాయతీలోని సోమవారం కొత్తపాలెం గ్రామానికి చెందిన గిరిజనులు దుస్సాల్వతో ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణలో భాగంగా పంచాయతీ ప్రజలకు అందరికీ అందుబాటులో ఉంటూ, అంకిత భావంతో పని చేసి, గిరిజనుల యొక్క మన్ననులు పొందారని, పంచాయతీ కార్యదర్శి డిడి ఓగా మంచి సేవలందించారని పలువురు కొని యాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వంతల నారాయణరావు, ఉర్దోప్, వంతల చంద్రావు, మాజీ సర్పంచ్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

మన్య ప్రాంతంలో తెదేపా బలోపేతానికి ప్రసాద్ చేస్తున్న కృషి అభినందనీయం

తెదేపా మండల ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య

విశాలాంధ్ర - చింతపల్లి : మన్య ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి మొట్టడం ప్రసాద్ చేస్తున్న కృషి అభినందనీయమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, చింతపల్లి మండల ఉపాధ్యక్షుడు కిముడు లక్ష్మయ్య అన్నారు. ప్రసాద్ 45వ జన్మదిన వేడుకలను లంబసింగి పంచాయతీ తోటరాజుబంద గ్రామంలో సోమవారం ఆ పార్టీ చింతపల్లి మండల మాజీ అధ్యక్షుడు బేరా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన ముందుగా ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులు, గర్భిణీలకు రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండ్రి రాజకీయ వారసత్వాన్ని పునికి పుచ్చుకున్న ప్రసాద్ కష్టకాలంలో సైతం పార్టీని నమ్ముకుని ఉండడమే గాక, పార్టీ ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించడంలో ముఖ్య భూమిక పోషిస్తున్నారన్నారు. గిరిజన సహకార సంస్థ చైర్మన్ గా పనిచేసిన ఆయన ప్రస్తుతం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారన్నారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు పొత్తూరు రాంబాబు, పార్టీ నాయకులు బోనంగి. లింగమూర్తి, జర్త. చిన్నబ్బాయి, గెమ్మెలి. దేముడు, లోచల. రమణ, గెమ్మెలి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి : వైకాపా ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర - చింతపల్లి : కనకదుర్గమ్మ ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని పాడేరు మాజీ శాసన సభ్యురాలు, వైకాపా ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం చింతపల్లి వచ్చిన ఆమె చింతపల్లి, జీకే వీధి ఎంపీపీలు కోరాబు అనూష దేవి, బోయిన కుమారి లతో కలిసి స్థానిక రంగా సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయ దశమిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ, గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవార్ల ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలన్నారు. ఈ సందర్భంగా కనకదుర్గమ్మ ఉత్సవ కమిటీ భాగ్యలక్ష్మితో పాటు ఎంపీపీలు అనూష దేవి, కుమారిలకు చీరలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యురాళ్ళు దాసరి ధారలక్ష్మి, చిందాడ జయలక్ష్మి, వైకాపా మండల అధ్యక్షుడు మోరి రవి, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, హేమంత్ కుమార్, దారబాబు పాల్గొన్నారు.

శ్రీమహాచండీ దేవిగా అమ్మ వారి దర్శనం

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : అల్లూరి సీతా రామరాజు జిల్లా మండలంలోని రేఖపల్లి, వడ్డిగూడెం, విఆర్ పురం, రాజుపేట కాలనీ, సీతంపేట, శ్రీరామగిరి తదితర గ్రామాలలో మండ పాలలో వెలిసియున్న శ్రీ కనకదుర్గ మాత విజయ దశమి ఐదవవ రోజైన సోమవారం శ్రీమహా చండీ దేవి అవతారములో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారిని దర్శించు కునేందుకు ఆయా మండపాలలో వెలసి ఉన్న దుర్గామాతకు పూజలు నిర్వహించేందుకు భక్తజనులు వందలాదిగా తరలివచ్చి పూజలు నిర్వహించి తమ తమ మొక్కులను చెల్లించుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా మండపాల కమిటీ సభ్యులుతగు ఏర్పాట్లను చేశారు.

విశాలాంధ్ర పార్వతీపురం మన్యం

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై విస్తృత ప్రచారం

విశాలాంధ్ర - పార్వతీపురం : మండలంలో లచ్చిరాజుపేట గ్రామంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి.షణ్ముఖరాజ్ ఆధ్వర్యంలో 365 రోజులు ఆదాయం వచ్చే విధంగా ఏటీఎం మోడల్ లో వేయడం జరిగింది. అదేవిధంగా డోకిశీల గ్రామంలో సామూహికంగా తూటికాడ కషాయం తయారు చేయడం జరిగింది. షణ్ముఖరాజు మాట్లాడుతూ ఏటీఎం మోడల్ లో నిత్యం 365 రోజులు కూడా ఆదాయం వచ్చేలా పలు రకాల పంటలు వేసుకోవాలని అన్నారు. రైతులందరు ఏటీఎం మోడల్స్ వేసుకుని ఆదాయం పొందవచ్చన్నారు. ప్రస్తుతం వరి పంటలో సుడిదోమ ఎక్కువగా ఉన్నందున తుటికాడ కషాయం తయారు చేసి, పిచికారీ చేస్తే మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. కావున దోమపోటు నివారణకు తుటికాడ కషాయం చేసుకోవాలన్నారు. రైతులందరికి ప్రక ృతి వ్యవసాయ పద్ధతులుపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ వై.తిరుపతి రావు యూనిట్ ఇన్చార్జిలు మరడాన శ్రీరాములు,కర్రి సౌజన్య, ఐసీఆర్పీలు అంబటి శ్రీనివాసరావు,గార సత్యవతి, రెడ్డి తిరుపతిరావు, బంకపల్లి వెంకటరమణ, ఉర్లక ప్రశాంత్, శకుంతల, కర్రీ సూర్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీల ఉప సర్పంచ్, వార్డుమెంబర్ల శిక్షణ కార్యక్రమం ప్రారంభం

విశాలాంధ్ర - సీతానగరం : గ్రామ పంచాయతీల పరిపాలన గూర్చి, పంచాయతీలకు ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సహాయము తదితర అంశాలపై అవగాహన పొందేందుకు శిక్షణలు ఎంతో దోహదపడతాయని ఎంపీపీ బలగ రమణమ్మ, జడ్పిటిసి మామిడి బాబ్జీలు తెలిపారు. సోమవారం నాడు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండలంలోని 35 గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్లకు, వార్డు మెంబర్లకు శిక్షణ కార్యక్రమాలను వారు ప్రారంభించారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శిక్షణా కార్యక్రమాల ముఖ్య ఉద్దేశాన్ని ఎంపీడీఓ త్రివిక్రమరావు తెలిపారు. శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెండు బ్యాచ్ లవారీగా రెండురోజులు చొప్పున శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిఓటిలైన శశిభూషణరావు, మనోహరరావు, శ్రీనివాసరావు, పీటర్ పాల్, ప్రతీ పంచాయతీకి చెందిన ఉపసర్పంచ్, ఇద్దరు వార్డు మెంబర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో పోటీపడేలా క్రీడాకారులకు శిక్షణ ఇవ్వాలి

విశాలాంధ్ర - పార్వతీపురం : జాతీయ స్థాయిలో పోటీపడేలా జిల్లాలోని క్రీడాకారులకు శిక్షణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాల యంలో క్రీడా సాధికారిత సంస్థ జిల్లా అధికారి ఎస్.వెంకటేశ్వర రావు కలెక్టర్‌ని కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విలు విద్యకు మంచి శిక్షణ ఇవ్వడం జరుగుతోందని, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు పంపాలని ఆయన సూచించారు. జిల్లాలో క్రీడాకారులకు కొరత లేదని వారికి సరైన శిక్షణ, వసతి కల్పిస్తే జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తెస్తారని కలెక్టర్ తెలిపారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగే క్రీడా పోటీలకు మన్యం జిల్లా నుండి క్రీడాకారులు పాల్గొని, గెలుపొందుతున్నారని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో పెరిగిన పోటీలను దృష్టిలో పెట్టుకుని ప్రతిభ ఉన్న క్రీడాకారులను ఎంపిక చేయాలని సూచించారు. క్రీడల వల్ల మానసిక, శారీరక ఆరోగ్యానికి సానుకూల ఫలితాలను ఇస్తాయని కలెక్టర్ తెలిపారు. క్రీడాకారులకు జిల్లాలో మంచి స్టేడియం నిర్మాణానికి స్థలం గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. స్టేడియం ఏర్పాటు చేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ జిల్లా క్రీడాదికారికి సూచించారు. జిల్లాలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా సదుపాయాలు కల్పనకు ప్రణాళికలు తయారు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సారి రాష్ట్ర స్థాయిలో జరగబోయే క్రీడా పోటీల్లో మన జిల్లా తరపున విలు విద్య క్రీడాకారులను పోటీలకు పంపాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించుటకు జిల్లా కేంద్ర స్థానం కావాలని కలెక్టర్ చెప్పారు. పాఠశాలలో క్రీడల నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వివిధ స్థాయిల్లో క్రీడా పోటీలు నిర్వహించి విద్యార్థుల్లో క్రీడాసక్తి నింపాలన్నారు.

సీతానగరం తహశీల్దార్‌గా ప్రసన్న కుమార్ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర - సీతానగరం : మండల తహశీల్దారుగా కె.ప్రసన్న కుమార్ సోమవారం నాడు బాధ్యతలు స్వీకరించారు. ఆయన బాధ్యతలు స్వీకరించడంతో ఇంత వరకు తహసీల్దారుగా పనిచేసిన జె.రాములమ్మ రిలీవ్ అయి ఆయనకు బాధ్యతలు అప్పగించారు. రాములమ్మకు వేపాడ బదిలీ అయిన సంగతి తెలిసిందే. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ప్రసన్నకుమార్ విజయనగరం జిల్లా నుండి ఇక్కడకు విచ్చేశారు. ఆయనను ఉపతహశీల్దార్ ఉమామహేశ్వరరావు, రెవిన్యూ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు అభినందించారు. అందరి సహకారంతో మండలంలో రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ప్రసన్నకుమార్ తెలిపారు. జాయిన్ అయిన తర్వాత పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

బియ్యం అక్రమ రవాణాను అడ్డుకున్న పోలీసులు..7700 కిలోల బియ్యం స్వాధీనం

విశాలాంధ్ర - సీతానగరం : ప్రజాపంపిణీ వ్యవస్థకు చెందిన 7 వేల7 వందల కిలోల బియ్యం అక్రమరవాణా జరుగుతుండగా పట్టివేయడం జరిగిందని విజిలెన్సు అండ్ ఎనోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ బి.సింహాచలం తెలిపారు. విజిలెన్స్ అండ్ ఎనోర్స్మెంట్ రీజినల్ విజిలెన్సు అండ్ ఎనోర్స్మెంట్ అధికారి (శ్రీకాకుళం) బర్ల ప్రసాదరావుకు అందిన సమాచారం మేరకు సోమవారం విజిలెన్సు అండ్ ఎనోర్స్మెంట్ అధికారులు, సీతానగరం రెవెన్యూ అధికారులు సంయుక్తంగా బొబ్బిలి నుండి పార్వతీపురం వైపు వెళుతున్న వాహనాలు తనిఖీ చేయడం జరిగిందని చెప్పారు. కాశాపేట - సీతానగరం మధ్యలో ఏపీ39-యుడి-8152 నెంబర్ గల మహీంద్రా బొలెరో పికప్ వాహనంలో 52 బస్తాలు, ఏపీ 39 యుఈ 8038 అశోక్ లేలాండ్ వాహనంలో 53 బస్తాలు, ఏపీ -31-టి ఎన్ 0992 మహీంద్రా బొలెరో పికప్ వాహనంలో 49 బస్తాలు కలిపి 154 బస్తాలు 7700 కేజీల బియ్యం అక్రమ రవాణాను గుర్తించడం జరిగిందని ఆయన అన్నారు. బియ్యం విలువ 3 లక్షల 50 వేల 350 రూపాయలుగా అంచనా చేయడం జరిగిందని ఆయన వివరించారు. ప్రజా పంపిణికి చెందిన బియ్యంను అక్రమంగా బొబ్బిలి మండలం పిరిడి, కమ్మవలస గ్రామాలకు చెందిన రేపాక శ్రీనివాసరావు, భోగిరాల శ్రీనివాసరావు, కేతల ధనుంజయ రావులు రవాణా చేస్తుండగా అధికారులు పట్టుకున్నారన్నారు. బియ్యంను వాహనములతో పాటు సీజుచేశామని ఆయన తెలిపారు. సరుకు యజమానులను పిడిఎస్ బియ్యం గురించి ప్రశ్నించగా చుట్టుపక్కల గ్రామాలలో పిడిఎస్ బియ్యం కిలో 18 రూపాయలకు కొనుగోలుచేసి వాటిని ఒరిస్సా రాష్ట్రంలో అధిక ధరలకు అమ్ముతున్నట్లు తెలిపారని చెప్పారు. ప్రభుత్వము పేద ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయుచున్న పిడిఎస్ బియ్యంను అక్రమంగా కొనుగోలు చేయడం, నిల్వ చేయుట, అమ్ముట నేరమని పేర్కొంటూ ఆయా వ్యక్తులు పైన, వాటి వాహన డ్రైవర్లు కమ్ ఓనర్లు పైన సెక్షన్ 6(ఏ), మరియు 7(1) ఈసి చట్టప్రకారం చర్య తీసుకొనుటకు రెవిన్యూ అధికారులకు అప్పగించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్ళు లక్ష్మినారాయణ, శేషగిరి, రెవెన్యూ సిబ్బంది సిఎస్డిటి యస్.రమేష్ బాబు, విఆర్ఓలు ఎస్.లక్ష్మి, జి.నాగమణి, కుమార్, ఎం.సింహాచలంలు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర - బెలగాం : రైలు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. పార్వతీపురం రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం (బెలగాం) రైల్వే గేటుకు సమీపంలో హెరాం సిగ్నల్ వద్ద డౌన్ లైన్ ట్రాక్ రైలు పట్టాలు దాటుతున్న వ్యక్తిని విశాఖపట్నం నుంచి రాయపూర్ వెళ్తున్న ప్యాసింజర్ రైలు ఢీకొట్టింది. దీనితో అతను అక్కడికక్కడే మ్రతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మ ృతుడు గరుగుబిల్లి మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన తూముల బాలకృష్ణ (37)గా గుర్తించి మ ృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. విజయనగరం జీఆర్పి ఎస్ఐ బాలాజీరావు ఉత్తర్వులు మేరకు హెడ్ కానిస్టేబుల్ వియన్ మూర్తి కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాముకాటుకు గురై చికిత్స పొందుతూ యువకుడు మృతి

విశాలాంధ్ర - కురుపాం : పాముకాటు కు గురైన యువ కుడు పార్వతీ పురం జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు తెలిపారు. ఆయన అందించిన వివరాలు ప్రకారం ఏగులవాడ పంచాయతీ సీడిమానుగూడ గ్రామానికి చెందిన ఆరిక. మోహనరావు (23) రాత్రి ఇంట్లో నిద్రలో ఉండగా పాముకాటు వేయడంతో నాటు మందు వాడి ఉదయం కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం నకు తరలించారు ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన వైద్యం కోసం పార్వతి పురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అక్టోబర్ 6 మద్యాహ్నం మృతి చెందారని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విశేషమైన సేవలకు మారుపేరు ఎస్.ఆర్.శంకరన్

విశాలాంధ్ర - పార్వతీపురం : సాంఘిక సంక్షేమ కార్య కలాపాల్లో విశేషమైన సేవలకు మారుపేరు ఎస్.ఆర్. శంక రన్ అని, ఆయన చూపిన మార్గం అందరికీ ఆదర్శమని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ కొని యాడారు. పీపుల్స్ ఐఏఎస్ అధికారిగా పేరు తెచ్చుకున్న ఎస్.ఆర్. శంకరన్ వర్ధంతి కార్యక్రమం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పీఓ ఐటిడిఏ మరియు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవతో కలిసి శంకరన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొని యాడారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కేశవ నాయుడు, డ్వామా పిడి రామచంద్రరావు, జిల్లా ఆర్డబ్ల్యూఎస్ అధికారి ప్రభాకర్ రావు, జిల్లా వెలుగు అధికారి సత్యం నాయుడు తదితరులు సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన ఎంపీడీవో

విశాలాంధ్ర - పార్వతీపురం : పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ని పార్వతీపురం ఎంపీడీవో రూపేష్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అదించాలని ఎమ్మెల్యే తెలిపారు.

పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

విశాలాంధ్ర - సీతంపేట : మండలం పరిదిలో గల 53 గ్రామ పంచాయతీ లకు చెందిన ఉపసర్పంచ్ మరియు ఇద్దరు వార్డు మెంబర్లకు పంచాయతీ రాజ్ శాఖా మాత్యులు వారి ఆదేశముల మేరకు సీతంపేట యూత్ ట్రైనింగ్ సెంటర్ నందు గ్రామ పంచాయతీ కామన్ అడ్మినిస్ట్రేషన్, త్రాగునీరు, సమావేశాలు, గ్రామ సభ నిర్వహణ మొదలకు అంశములపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది. సదరు కార్యక్రమం గౌరవ మండల పరిషత్ అధ్యక్షులు బి.ఆదినారాయణ మరియు డివిజనల్ పంచాయతీ అధికారి రాంప్రసాద్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగినది. సదరు కార్యక్రమం మొత్తం రెండు రోజులు కోర్సు డైరెక్టర్ మరియు అసిస్టెంట్ డైరెక్టర్ అయిన ఎంపిడిఓ మరియు విస్తరణ అధికారి అయిన కొండపల్లి సత్యం ఆధ్వర్యం లో జరుగుతున్నది. మరియు సదరు కార్యక్రమం నిర్వహణలోలుగా సీతంపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.సుదర్శనరావు, కుషిమి పంచాయతీ కార్యదర్శి డి.రాజశేఖరం, కుడ్డవల్లి పంచాయతీ కార్యదర్శి వై.పాపారావు అన్ని అంశములు పై సదరు వార్డు సభ్యులకు శిక్షణ ఇవ్వడం జరిగినది. మరియు ఈ కార్యక్రమంను మండల పరిషత్ వారు మాస పర్యవేక్షణ చేయడం జరిగినది.

విశాలాంధ్ర పేజి : 2
అల్లూరి సీతారామరాజు
పార్వతీపురం మన్యం
మంగళవారం 8, అక్టోబరు 2024

చింతపల్లి తహసీల్దార్‌గా రవికుమార్ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర - చింతపల్లి : చింతపల్లి నూతన తహసీల్దార్ గా భూమారెడ్డి రవికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలలో భాగంగా చింతపల్లి తహసిల్దార్ రామకృష్ణను జీకే వీధి తహసిల్దార్‌గా బదిలీ చేయడంతో పాటు, చింతపల్లి తహసిల్దార్‌గా రవికుమార్ ను నియమించడంతో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన రవికుమార్ కు స్థానిక డిప్యూటీ తహసిల్దార్ రాజ్ కుమార్, ఆర్ ఐ ఎం కృష?మూర్తి, చిన్నయ్య పడాల్ తదితర సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

100 రోజుల్లోనే ప్రజలకు విసుగు పుట్టించిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం

వైకాపా ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర - చింతపల్లి : అధికారమే లక్ష్యంగా అమలు సాధ్యం కానీ హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వ విధానాలపై 100 రోజులలోనే ప్రజలు విసుగెత్తి ఉన్నారని పాడేరు మాజీ శాసన సభ్యురాలు, వైకాపా ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం చింతపల్లి వచ్చిన ఆమె స్థానిక ఎంపీపీ కోరాబు అనూష దేవి తో కలసి మాట్లాడుతూ మతోన్మాద బిజెపితో జతకట్టిన జనసేన, తెలుగుదేశం పార్టీల కుయుక్తులను రాష్ట్ర ప్రజలు కేవలం 100 రోజులలోనే తెలుసుకున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలను వంద రోజులలోనే అమలు పరుస్తామని చెప్పిన తెదేపా అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తి అయినప్పటికీ కేవలం పెన్షన్ పెంపు తప్ప మిగిలిన హామీలను విస్మరించారన్నారు. వైకాపా ప్రభుత్వంలో సుమారు 64 లక్షల మందికి సామాజిక పెన్షన్ లు అందజేశామన్నారు. వీరిలో సాధారణ పెన్షన్ లబ్ధిదారులకు 3 వేల రూపాయలు పెన్షన్, పక్ష వాతంతో బాధపడుతున్న లబ్ధిదారులకు 5 వేల రూపాయలు పెన్షన్, సికిల్ సెల్, కిడ్నీ సంబంధ డయాలసిస్ బాధితులకు పదివేల రూపాయల చొప్పున పెన్షన్ అందజేసిన ఘనత వైకాపా ప్రభుత్వానిదన్నారు. నేడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం 4 వేల రూపాయల పెన్షన్ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఇదే క్రమంలో ఈ ప్రభుత్వం ఎంతమందికి పెన్షన్ అందిస్తుందో చెప్ప వలసిన అవసరం ఉందన్నారు. అర్హత లేని వారికి పెన్షన్ తొలగిస్తామని ఎన్డీఏ ప్రభుత్వం చెప్పడాన్ని ఆమె తప్పు పట్టారు. నాడు అర్హత ఉండి పెన్షన్ పొందలేని ఎంతోమందికి సదరం ధ్రువీకరణ పత్రాలు అందించి పెన్షన్ కు అర్హత కల్పించి పెన్షన్ అందించడం జరిగిందన్నారు. నేడు అర్హత లేని వారికి పెన్షన్ తొలగిస్తామని చెప్పడంలో ఈ ప్రభుత్వ ఆంతర్యం ఏమిటని ఆమె ప్రశ్నించారు. ఏ అర్హతను కొలమానంగా చేసి పెన్షన్ అందిస్తారో చెప్పాలన్నారు. ఇదే క్రమంలో వైకాపా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా

తీసుకువచ్చిన వాలంటీర్ వ్యవస్థను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. విపత్తులు, సమస్యల పరిష్కార దిశగా పనిచేసే వాలంటీర్ వ్యవస్థ లేకపోవడం వలనే ఆట రాష్ట్ర రాజధాని విజయవాడలోనూ, ఇటు ఉమ్మడి విశాఖ ఏజెన్సీ లోను తుఫాను విపత్తును సరైన సమయంలో తెలుసుకునే సమాచారం లేకుండా పోయిందన్నారు. నేడు ఆ వ్యవస్థ లేకపోవడం వలన ఎంత పంట నష్టం జరిగింది, ఎన్ని కుటుంబాలు నిరాశ్రయులయ్యారు, ఎన్ని పశువులు మృత్యువాత పడ్డాయనే సమాచారం నేటికి అధికారుల వద్ద పూర్తిస్థాయిలో లేదన్నారు. వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని చెప్పుకొచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం నేడు ఆ దిశగా ఆలోచన చేయడం లేదన్నారు. గత ప్రభుత్వంలో వాలంటీర్లుగా పనిచేసిన వారందరికీ నేడు దిశా నిర్దేశం లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. వాలంటీర్లు ధర్నా చేస్తున్నా ప్రతిపక్ష వాలంటీర్ల కోసం ఆలోచిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పుకొస్తున్నారని, అదే ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న కొంతమంది వాలంటీర్ వ్యవస్థ లేకుండా సచివాలయ సిబ్బందితో సకాలంలో పెన్షన్ లు పంపిణీ చేస్తున్నామని, వాలంటీర్లతో పనేమిటనే రీతిలో మాట్లాడుతున్నారని ఇది ఎన్డీఏ ప్రభుత్వంలో పాలకుల రెండు నాలుకల ధోరణి అని ఆమె దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ పేరుతో 18 ఏళ్ళు నిండిన ప్రతి మహిళకు నెలకు 15 వందల రూపాయలు, ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం పేరిట కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అందరికీ 15 వేల రూపాయలు చొప్పున అందిస్తామని చేసిన హామీలన్నీ నీటి మూటలు అయ్యాయన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు పూర్తికావస్తున్నప్పటికీ నేటికీ అమ్మ ఒడి, విద్యా దీవెన ఊసే లేదన్నారు. తుఫాను ప్రభావంతో పంట నష్టం జరిగి రైతులు అల్లాడుతున్నా పంట నష్టం, రైతు భరోసాల ఊసే లేదన్నారు. ప్రజలను మభ్యపెడుతూ, ప్రతిపక్ష రాజకీయ పార్టీలను విమర్శిస్తూ పరిపాలన సాగించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే అనుభవం ఉపయోగ పడుతుందన్నారు. చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలో ఆర్నెల్ల ఆడబిడ్డ పై అత్యాచారం చేసి చంపి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ లో పడవేసిన ఘటన దారుణం అన్నారు. దీనిపై ముస్లిం సంఘాలు, మహిళా సమాఖ్య, యువత ధర్నాలు చేసినప్పటికీ ముఖ్యమంత్రి కానీ, హోం మంత్రి గాని స్పందించలేదన్నారు. ఆ సమయంలో తిరుపతిలోనే ఉన్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కనీసం మానవతా దృక్పథంతోనైనా ఆ సంఘటనపై మాట్లాడిన సందర్భం లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలోకి రాకముందు సమాజంలో మార్పు రావాలి, పరిపాలనలో పారదర్శకత ఉండాలి, తప్పు చేస్తే ఎంతటి వారినైనా ప్రశ్నిస్తాను అని మాట్లాడిన పవన్ కళ్యాణ్ నేడు ఉప ముఖ్యమంత్రిగా ఆ విషయాలపై ఎందుకు మాట్లాడడం లేదని ఆమె ప్రశ్నించారు. అధికారంలో లేని సమయంలో వాలంటీర్ వ్యవస్థపై ఎన్నో నిందారోపణలు చేసిన పవన్ కళ్యాణ్ నేడు రాష్ట్రంలో జరుగుతున్న దారుణాలపై ఎందుకు నోరు మెదపడం లేదని, ఇదేనా సామాజిక స్పృహ అని ఆమె ప్రశ్నించారు. వంద రోజులలో ఏమి సాధించారని ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాలు నిర్వహించారో పాలకులు ప్రజలకు సమాధానం చెప్పాలని ఈ సందర్భంగా ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు బిందాల జయలక్ష్మి, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులకు ఘన సత్కారం

విశాలాంధ్ర - సీతంపేట : నీతి ఆయోగ్, ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ కింద సంపూర్ణ అభియాన్ ముగింపు వేడుకను సీతంపేట ఐటీడీఏ లో ప్రాజెక్టు అధికారి సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడమైనది. ఈ ముగింపు వేడుకలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరచిన అధికారులకు ఐటీడీఏ పీవో సత్కరించారు. నీతి ఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు ఈ వేడుకను నిర్వహించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా సంపూర్ణ అభియాన్‌లోని మొత్తం 6 సూచికలలో 100% సంతృప్తతను చేరుకోవడానికి తమ శాయశక్తులా కృషి చేసిన బిఎల్‌ఓలు మరియు ఫ్రంట్‌లైన్ కార్యకర్తలను ఈ సందర్భంగా సత్కరించారు. భామిని మండలంలో ఈ 6 సూచికలు నీతి ఆయోగ్ అందించిన సమయ పరిమితి కంటే ముందు గానే సంతృప్తమయ్యాయని తెలిపారు. భామిని బ్లాక్ స్థాయి అధికారులు మరియు ఫ్రంట్‌లైన్ కార్మికుల పట్టుదలతో 25 సెప్టెంబర్ 2024న సూచించిన 6 సూచికలు విద్య, వైద్య, ఆరోగ్య, వ్యవసాయ మరియు సోషల్ డెవలప్మెంట్ విభాగాలలో సంతృప్తి పొందినట్లు పీవో తెలిపారు. భామిని మండల ఎంపిడిఓ, సీడీపీవో, ఎంవో, వెలుగు ఏపీఎం, ఐసీడీఎస్, వైద్య, ఆరోగ్య, వ్యవసాయ వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు, డీడీ ఆన్నదొర, కె.సింహాచలం ఎంపీడీఓ, ఏ.శ్రీనివాసరావు, ఎంఈఓ, శాంతి భవాని సిడిపిఓ, డా.పి.సోయల్, డా.దీపికరాణి, డా.బి.దామోదర్ రావు, భవాని, కె.మహేశ్వరరావు బ్లాక్ కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కథనానికి విశేష స్పందన

స్పందించిన సర్పంచ్ పుష్పలత, కార్యదర్శి శ్రీనివాస్

విశాలాంధ్ర - చింతపల్లి : నివాస గృహాల చెంత గోవుల పడవు నియంత్రించండి అనే విశాలాంధ్ర కథనానికి విశేష స్పందన వచ్చింది. స్థానిక అంబేద్కర్ కాలనీలో నివాస గృహాల చెంత గోవులను వధించడం వలన సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆరోపించిన విషయం విదితమే. ఈ విషయమై సోమవారం విశాలాంధ్రలో ప్రచురితమైన కథనానికి స్పందించిన స్థానిక సర్పంచ్ దురియాపుష్పలత పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ లు నివాస గృహాల చెంత గోవులు వధించే ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నివాస గృహాల చెంత గోవులను వధించరాదని గోవులను వధించే వ్యాపారులకు గతంలోనే నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం వ్యాపారులు మరలా ఇటువంటి కార్యక్రమాలకు పాల్పడడం పై వివిధ పత్రికలలో వచ్చిన కథనాలపై స్పందించడం జరిగిందన్నారు. పశువులను పెంచుకునే రైతులు, వధించే వ్యాపారం చేసుకునే వ్యాపారులు ఇతరులకు ఇబ్బంది కలగకుండా వాటిని నిర్వహించుకోవాలని అన్నారు. పశువులను పెంచుకునే వారు వాటిని ఇష్టారీతిన వదిలిపెట్టడం సరైన విధానం కాదన్నారు. పశువులు రహదారులపై తిరుగుతుండడం వలన ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం లేకపోలేదన్నారు. ఇప్పటికే అనేక పశువులు రోడ్లపై మరణించడం వాటిని తొలగించేందుకు పంచాయతీ పాలకవర్గం, అధికారులు, సిబ్బంది పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావన్నారు. ఇటువంటి వాటిని దృష్టిలో ఉంచుకుని పశు యజమానులు వాటిని తగురీతిన సంరక్షించుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా రహదారులపై పశువులను విడిచిపెడితే పంచాయతీ పరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పశు మాంసం కు సంబంధించి గ్రామానికి దూరంగా వధించుకోవాలని గృహాల మధ్య నిర్వహించి ఇతరులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

వన్యప్రాణి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

విశాలాంధ్ర - కూనవరం : వన్యప్రాణి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కూనవరం రేంజర్ ఎం కిరణ్‌కుమార్ అన్నారు. వన్యప్రాణుల సంరక్షణ విషయం కట్టడి కార్యక్రమంలో భాగంగా సోమవారం కూనవరం లోని చర్చిలో, కనకదుర్గమ్మ గుడిలో భక్తుల సమక్షంలో మాట్లాడారు. హిందువులలో ఏనుగు తలతో వినాయకుడు, ఎలుక, శివుడి మెడలో పాము, దుర్గ పులి, సరస్వతి నెమలి వాహనం గా కలిగి ఉన్నారు. వన్య ప్రాణులను వేటాడకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు మరియు, సాంబశివరావు, చర్చి పాస్టర్ సూర్య కుమారి, ఆటవీ సిబ్బంది అనిల్ కుమార్, శంకర్ రెడ్డి, సీతారాం రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాదర్బార్

విశాలాంధ్ర - కొమరాడ : ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నేడు ప్రజా దర్బార్ మంగళవారం చోళ పదం పంచాయతీ కూనేరు గ్రామంలో కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ నిర్వహిస్తారని తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ శేఖర్ పాత్రుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 31 పంచాయతీ గ్రామాల నుండి వచ్చి ఎమ్మెల్యే కి వినతిపత్రం ఇవ్వుకోవచ్చుని అలాగే కోటిపాం కాలనీ నుండి గుంప శివాలయం వరకు బీటీ రోడ్ శంకుస్థాపన చేయనున్నారని ఈ కార్యక్రమానికి ఎన్డీఏ కూటమి నాయకులందరూ పాల్గొన వలసిందిగా ఆయన కోరారు.

సంభవ్ స్టీల్ ట్యూబ్స్ డిఆర్ హెచ్‌పి దాఖలు

విశాలాంధ్ర - పాడేరు : సంభవ్ స్టీల్ ట్యూబ్స్ లిమిటెడ్ తన డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డి ఆర్ హెచ్ పి) ను సెబీ వద్ద రూ.540 కోట్ల వరకు దాఖలు చేసింది. ఐపీఓ కోసం సంభవ్ స్టీల్ ట్యూబ్స్ లిమిటెడ్ మార్చి 31 నాటికి స్థాపిత సామర్థ్యం ప్రకారం భారతదేశంలో ఎలక్ట్రిక్ రెసిస్టెన్స్ వెల్డెడ్ స్టీల్ పైపులు మరియు స్ట్రక్చరల్ ట్యూబ్‌ల (హోలో సెక్షన్) యొక్క ముఖ్య తయారీదారులలో ఒకటి గా ఉంది. 2024 క్రిసిల్ నివేదిక ప్రకారం దాని డ్రాఫ్ట్ రెడ్‌ను దాఖలు చేసింది మార్కెట్ రెగ్యులేటర్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియాతో హెర్రింగ్ ప్రాస్పెక్టస్ సమాచారం చేసింది. కంపెనీ ఈక్విటీ షేర్ల ఆఫర్ ద్వారా (ఒక్కొక్కటి ముఖ విలువ రూ. 10) ప్రారంభ పబ్లిక్ ఆఫర్ ద్వారా రూ. 5,400 మిలియన్ల (రూ.540 కోట్లు) వరకు నిధులను సేకరించాలని యోచిస్తోంది.

సర్పంచులకు శిక్షణ తరగతులు



విశాలాంధ్ర - కొమరాడ : సర్పంచులకు ఉప సర్పంచ్లకు శిక్షణ తరగతులు ఈనెల తొమ్మిదో తేదీ నుండి రెండు రోజులు పాటు మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ఎంపీడీవో ఎం మల్లికార్జునరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండల మొత్తం31 మంది సర్పంచులు ఉప సర్పంచ్ గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు ఉండగా ఒక మహిళా వార్డు మెంబర్లు ఉదయం 9:30 నుండి సాయంత్రం ఐదున్నర వరకు శిక్షణ తరగతులు ఉంటుందని సాధారణ కలిసి పరిపాలన విధానం పంచాయతీ రాజ్ చట్టం 1994 యొక్క ముఖ్య నిబంధనలు ముఖ్య అంశములు పై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారని బట్టి ప్రతి ఒక్కరు వచ్చి శిక్షణ కు హాజరవ్వాలని ఆయన కోరారు.

అమెరికా అండతో గాజాపై ఇజ్రాయిల్ దాడులు, యుద్ధం ఆపాలి

పాలస్తీనాకు సంఘీభావం కార్యక్రమంలో వామపక్షాల పిలుపు

విశాలాంధ్ర - బెలగాం : జిల్లాలో వామపక్ష పార్టీలు సిపిఐ, సిపిఐ, సిపిఐ ఎంఎల్, న్యూ డెమోక్రసీ, లిబరేషన్ పార్టీల ఆధ్వర్యంలో సోమవారం పార్వతీపురం నాలుగు రోడ్ల కూడలి వద్ద సంఘీభావ దినం పాటిస్తూ జరిగిన సభలో వామపక్ష జిల్లా నాయకులు కూరంగి మన్మథరావు, బొప్పి వెంకటేశ్వర్లు, ఎం. భాస్కరరావు, వి.భాస్కరరావు రెడ్డి వేటు, పి.సంగం తదితరులు మాట్లాడుతూ అమెరికా సంజ్ఞతో, నిరుద్యోగ సమస్య నుండి కాపాడుకోవడానికి ప్రపంచంలో యుద్ధాలను సృష్టిస్తుందని, పాలస్తీనా జాతిని నాశనం చేయటానికి ఇజ్రాయిల్ ను ఉపయోగించి ఆయుధాలను సప్లై చేస్తూ గాజాలో స్కూళ్ళు, కాలేజీలు, ఆస్పత్రులు, దేవాలయాలు, చర్చిలు, మసీదులపై దాడులు, దౌర్జన్యం చేస్తూ మారణహోమం సృష్టిస్తుందన్నారు. గత అక్టోబర్ 7వ తేదీన ప్రారంభించిన ఈ దాడులు విరమిస్తామని చెబుతూనే కొనసాగిస్తుందని, ఇజ్రాయిల్ గాజా, పాలస్తీనా జాతిపై దాడులు, యుద్ధం ఆపాలని, కాల్పులు విరమణ చేయాలని నాయకులు కోరారు. శాంతికి కాపాడే భారతదేశం అలీన ఉద్యమాన్ని మోడీ ప్రభుత్వం ఉల్లంఘించి పాలస్తీనా జాతిని అంతం చేయాలని చూస్తున్న అమెరికాకు, ఇజ్రాయిల్‌కు మద్దతు పలుకుతుందని, అలీన విదేశాంగ విధానాన్ని కాలం రాసిందన్నారు. ఈ యుద్ధాన్ని, దాడులను అమెరికాలో వ్యతిరేకిస్తున్న విద్యార్థులు, ప్రజలని, సంఘాల్ని అమెరికా ప్రభుత్వం అణిచివేసి తన ఆయుధాల్ని అమ్ముకొని ప్రపంచాన్ని నాశనం చేయాలని చూసే విధానాన్ని ప్రజలంతా ఖండించి పాలస్తీనాకు సంఘీభావంగా నిలవాలని నాయకులు అన్నారు. వామపక్ష పార్టీల నాయకులు బిడికి అప్పలనాయుడు, సూరయ్య, ఆర్వీఎస్ కుమార్, కూరంగి ప్రసాద్, రెడ్డి వేణు, వై.మన్మథరావు, పి.రమణి, దుర్గారెడ్డి, బి.సూరిబాబు, పి.శ్రీనునాయుడు సర్వేశ్వరరావు, బి.నాగేశ్వరరావు, ఇందిరా పాల్గొన్నారు.

ఎన్టీఆర్ గ్రామీణ ఇల్లు సర్వే

విశాలాంధ్ర - జికె వీధి : పెదవలస గ్రామ పంచాయతీ లెంట్ల వీధి గ్రామంలో ఎన్టీఆర్ గ్రామీణ హౌసింగ్ సర్వే జరిగింది. సర్వే నేటితో తో పూర్తి చెయ్యటం జరుగుతుందని హౌసింగ్ ఏఈ సెల్వే సూరిబాబు అన్నారు. ఇల్లు లబ్దిదారులు ఈ సర్వేకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సన్యాసిరావు ఆనందరావు (జైఎసీపీ) వంతల సూరిబాబు, గుడుతూరి అప్పారావు, గుడుతూరి రత్నకుమారి, గుడుతూరి రమణబాబు, గుడుతూరి నీరమ్మ ఇతరులు పాల్గొన్నారు.

జిల్లాలోని మద్యం షాపులకు 304 దరఖాస్తులు : ఏఈఎస్ జీవన్ కిషోర్

విశాలాంధ్ర - పార్వతీపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీలో భాగంగా జిల్లాలోని 52 షాపులకుగాను ఇప్పటివరకు 304 దరఖాస్తులు అందా యని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్ కిశోర్ తెలిపారు. దరఖాస్తులను స్వీకరించేందుకు మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉందన్నారు. అక్టోబర్ 9 సాయంత్రం లోగా తమ దరఖాస్తులను పార్వతీపురం, సీతానగరం, సాలూరు, కురుపాం, పాలకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. నూతన మద్యంపాలసీలో ఎటువంటి వదంతులను నమ్మవద్దని, అంతా పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుల గడువు ముగిసిన తరువాత అక్టోబర్ 11న జిల్లా కలెక్టర్ సమక్షంలో డ్రా తీసి షాపులను కేటాయించనున్నట్లు ఆయన వివరించారు.

సీతానగరం మండలంలో ఏనుగుల గుంపు

విశాలాంధ్ర - సీతానగరం : మన్యం జిల్లాలోని గత కొన్నేళ్లుగా కంటికి కునుకు లేకుండా కొమరాడ, కురుపాం, జియ్యమ్మవలస, వీరఘట్టంతదితర మండలాల రైతులను, ప్రజలను ఇబ్బందులు పెడుతున్న ఏనుగుల గుంపు సోమవారం సాయంత్రం సీతానగరం మండలంలోని తాన్నుసీతారాం పురం, రేపటివలస గ్రామాల్లో పొలాల్లో వచ్చి ఉన్నాయి. ఆయా గ్రామాల్లోని రోడ్లపై సంచరిస్తున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, పోలీస్, అటవీ అధికారులు తెలియజేస్తున్నారు. రాత్రికి ఇక్కడకు దగ్గరలో ఉన్న గుచ్చిమి, జోగమ్మ పేట కొండల్లోకి చేరే అవకాశం ఉందని అటవీ అధికారులు తెలియజేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి బంగారు పతకం సాధించిన విద్యార్థిని అభినందించిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు : డిస్కస్ త్రో లో బంగారు పతకం సాధించిన ఇంటర్మీడియట్ విద్యార్థి వంతల సింహాచలం ను జిల్లా కలెక్టర్ ఎ.ఎస్ దినేష్ కుమార్ అభినందించారు. ఇటీవల రాజమండ్రి లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలలో డిస్కస్ త్రో విభాగంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థి మొదటి స్థానం, షాట్ పుట్ లో మూడవ స్థానం సాధించి బంగారు, రజత పతకాలను పొంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస రావు, కోచ్ జి. మన్మథరావు తో కలసి జిల్లా కలెక్టర్ ను కలసిన విద్యార్థిని రెండు అథ్లెటిక్ పోటీలలో గెలుపొందినందుకు కలెక్టర్ అభినందిస్తూ, జాతీయ స్థాయిలో కూడా మొదటి స్థానం పొంది జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ నెల17 నుండి 19 వరకు గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న సౌత్ జోన్ నేషనల్ మీట్ లో సింహాచలం పాల్గొననున్నారు. స్థానిక పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపిసి మొదటి సంవత్సరం చదువుతున్న సింహాచలం ముంచింగిపుట్టు మండలం వలజంగి గ్రామానికి చెందినవారు.

పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి ఏజెన్సీ సమస్యలు

విశాలాంధ్ర - గంగవరం : రంపచోడవరం నియోజవర్గ సమస్యలను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి తీసుకెళ్ళినట్లు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కే సిద్ధు తెలిపారు. నిడదవోలు పార్టీ కార్యాలయం వద్ద రంప చోడవరం నియోజకవర్గ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి నట్లు ఆయన తెలిపారు. సందర్భంగా ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న సమస్యలు కందుల దుర్గేష్ గారికి సమస్యలను వివరించడం జరిగిందన్నారు. త్వరలోనే రంపచోడవరం నియోజకవర్గంలో పర్యటిస్తానని నియోజకవర్గంలో ముంపు ప్రాంతాల్లో ఉన్న సమస్యలన్నీ పరిష్కరించే దిశగా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారన్నారు. మారేడుమిల్లి టూరిజం అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తామని తెలిపారు అన్నారు. ఈ కార్యక్రమంలో రంపచోడ వరం నియోజక వర్గ సమన్వయకర్త కుర్ల రాజశేఖర్ రెడ్డి రంపచోడవరం మండల పార్టీ అధ్యక్షులు పిఠాని శ్రీను, దేవీపట్నం ఆతుకూరి వెంకట రాయుడు, గంగవరం కుంజం సిద్ధు, అడ్డతీగల జైరాం, సాయి, మారేడుమిల్లి దుర్గ ప్రసాద్, సత్యపేటపేట గంగాధర్, వికాశ్ గోపాల రెడ్డి, కునవరం గోపాలకృష్ణ, రామవరం రాజు, శ్రీనివాసరావు, చింతూరు నాయకులు రవి, నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆసక్తి గల అభ్యర్థులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి...

విశాలాంధ్ర - కురుపాం : నూతన మద్యం పాలసీ విధానం2024-26 దరఖాస్తు గడువు అక్టోబర్9సాయంత్రం వరకు ఉండని ఆసక్తి గల అభ్యర్థులు నిర్ణీతసమయం గడువు లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ ఎస్‌ఐ జె.రాజశేఖర్ సూచించారు. నాన్ రిఫండబుల్ డిడి, గుర్తింపు ధ్రువీకరణ పత్రాలు తో కురుపాం ఎక్సైజ్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన కౌంటర్లో దరఖాస్తు సమర్పించి రశీదు, లాటరీ ఎంట్రీ పాస్ తీసుకోవాలని కోరారు. కురుపాం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కురుపాం షాప్16-13, షాప్17-11 గుమ్మలక్ష్మిపురం షాప్ నంబర్ 10-6,షాప్ నంబర్ 11-8, జియ్యమ్మవలస షాప్ నంబర్ 12-3,షాప్ నంబర్ 13-2 దరఖాస్తులు చేసినా ఆయా షాపులకు సోమవారం సాయంత్రం నాటికి సరాసరి రెండు ధరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు.

డుంబ్రిగూడ ఎంపీడీవోగా ప్రేమసాగర్

విశాలాంధ్ర - డుంబ్రిగూడ : డుంబ్రిగూడ మండల నూతన ఎంపీడీవోగా ఎం. ప్రేమ సాగర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈయన వెస్ట్ గోదావరి జిల్లాలోని విధులు నిర్వర్తిస్తూ బదిలీలపై ఇక్కడి మండలంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజా అభివృద్ధికి ఎల్లప్పుడు కాంక్షిస్తూ ఉండాలని ఆయన కోరారు. మండల ప్రజా ప్రతినిధులు ప్రజలు సహకారం ఉండాలని ఆయన కోరారు. అనంతరం కార్యాలయం సిబ్బంది నూతన ఎంపీడీవో కు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

ఫీడర్ అంబులెన్స్‌లను పరిశీలించిన జిల్లా మేనేజర్

విశాలాంధ్ర - రాజవొమ్మంగి : ఫీడర్ అంబులెన్స్ జిల్లా మేనేజర్ శ్రీనివాస్ నాయక్ సోమ వారం రాజ వొమ్మంగి మండలానికి ఆ వచ్చి పలు చోట్ల అంబులెన్స్ పనితీరును పరిశీలించారు. మండలంలో జడ్డంగి, దోనెల పాలెం, అమ్మిరేఖల, కింద్ర గ్రామాల పరిధిలో ఫీడర్ అంబులెన్స్‌ల పనితీరును పరిశీలించారు. అనంతరం సిబ్బందికి తగు సూచనలు చేసి, ప్రజలకు ఎప్పుడు అందు బాటులో ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.

పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి ఫిర్యాదును వెంటనే పరిష్కరించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కు వచ్చే ప్రతి ఫిర్యాదును వెంటనే పరిష్కరం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాత్సవ, జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవ నాయుడులతో కలిసి ప్రజలనుండి వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. జిల్లాలోని సుదూర ప్రాంతాలనుండి వచ్చిన 105 మంది అర్జీదారుల తమ వినతులను జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు అందించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం అవుతా యనే నమ్మకంతో నలుమూల ప్రాంతాల నుంచి అర్జీదారులు ఇక్కడికి వస్తుంటారని అన్నారు. అటు వంటి వారి సమస్యలను సావధానంగావిని, సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమస్యకు న్యాయమైన పరిష్కారం చూపాలని, ఆరోపిస్తూంతో అర్జీ దారులు సంతృప్తి చెందాలని సూచించారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పరిష్కారం చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాండ్ అంబాసిడర్‌గా సచిన్ టెండూల్కర్

విశాలాంధ్ర - పాడేరు : బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్‌ని బ్యాంక్ సంతకం చేసినట్లు ఈ రోజు ప్రకటించింది. సచిన్ టెండూల్కర్ మరియు బ్యాంక్ ఆఫ్ బరోడా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం శ్రేష్ఠత పట్ల నమ్మకం వంటి ప్రధాన విలువ యొక్క లోతైన అమరికపై నిర్మించబడింది. బ్యాంక్ ఆఫ్ బరోడాతో భాగస్వామ్యం అనుకూల సమయంలో వస్తుంది, ఇది సచిన్ బ్రాండ్ ప్రభను పెంచుతూ వేగవంతమైన వృద్ధి పథాన్ని అనుసరిస్తున్నందున దాని పరివర్తన ప్రయాణం యొక్క తదుపరి దశను ప్రేరేపించేయడానికి సిద్ధంగా ఉంది. బ్యాంక్ ఆఫ్ బరోడా "ప్లే ది మాస్టర్‌స్ట్రోక్" పేరుతో సచిన్‌తో తన మొదటి ప్రచారాన్ని ప్రారంభించింది. లక్షలాది మంది విశ్వసించే మరియు శతాబ్దానికి పైగా వారసత్వంతో మద్దతునిచ్చే బ్యాంక్‌ను ఎంచుకోవడం ద్వారా వారి ఆర్థిక ఆకాంక్షలను సాకారం చేసుకోవడానికి మాస్టర్‌స్ట్రోక్ ఆడటానికి మిలియన్ల మంది వినియోగదారుల ప్రజలను ప్రోత్సహిస్తుంది.

గ్రీవెన్స్‌లో సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే శిరీష దేవి

విశాలాంధ్ర - వై.రామవరం : గ్రీవెన్స్ లో తన దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని రంపచోడవరం ఎంఎల్ఏ మిరియాల శిరీష దేవి తెలిపారు. సోమవారం వై.రామవరం లో ఆమె ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. మొత్తం 200 దరఖాస్తులు అర్జీ దారులు అందజేశారు. వీటిలో గత ప్రభుత్వ హయంలో కొందరు లబ్ధి దారులు హౌసింగ్ బిల్లులకు కక్షపూరితంగా నిలిపి వేశారని, అలాగే పెన్షన్ లను, రేషన్ కార్డులను తొలగించడం జరిగిందని అర్హత ఉండి కోల్పోయిన ఆయా పథకాలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా స్థాయిలో పరిష్కరించేందుకు ఆమె కృషి చేస్తామని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతానని హామీ ఇచ్చారు. పలువురు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపి పరిష్కారానికి చర్యలు తీసు కోవాలని ఎంపీడీవో రవిశంకర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాబ్జి దొర, టీడీపీ అధ్యక్షుడు రమణారెడ్డి, పుష్పరాజు, రామ లక్ష్మి, టీడీపీ సీనియర్ నాయకుడు రెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

మద్యంషాపులకు దరఖాస్తు చేసేందుకు రెండురోజులే గడువు : సీఐ పద్మావతి

విశాలాంధ్ర - సీతానగరం : ప్రభుత్వం కొత్తగా ఏర్పాటుచేసిన మద్యంపాలసీ ప్రకారం రెండేళ్లకు కొత్త షాపులను పెట్టేందుకు దరఖాస్తులు చేసేందుకు ఇంకా రెండురోజులుమాత్రమే గడువుఉందని సీతానగరం ఎక్సైజ్ సర్కిల్ సిఐ పద్మావతి తెలిపారు. సోమవారం సాయంత్రం నాటికి సీతానగరం మండలంలోని నాలుగు షాపులకు 26, బలిజిపేట మండలంలోని ఐదుషాపులకు 8, గరుగుబిల్లి మండలంలోని మూడు షాపులకు 17 దరఖాస్తులు అందినట్లు ఆమె తెలిపారు. వీటితో పాటు ఆన్లైన్ కూడా మరికొంతమంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. మంగళ, బుధవారాల్లో పెట్టవలసిన దరఖాస్తులు ఎక్సైజ్ స్టేషన్ వద్ద స్వీకరిస్తామన్నారు. నమోదు ప్రక్రియలో ఎస్‌ఐ షఫీ బాషా, పి.అప్పలకొండ, కె.గొర్లు, జి.భూషణరావు, అనంతరావు, టి.శేషగిరిరాజు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు నిమగ్నమై స్వీకరణ ఆన్‌లైన్ కార్యక్రమాన్ని నిర్వహించి దరఖాస్తుదారులు అన్ని రకాల సేవలు అందిస్తున్నారు. జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలు, సూచనల మేరకు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఎటువంటి అపోహలు లేకుండా ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులు చేసుకుంటే ఈ నెల 11న జిల్లా కలెక్టర్ సమక్షంలో ప్రాధేయపడి జరుగుతుందని ఆమె తెలిపారు.

ఎమ్మెల్యే విజయ్ చంద్రను కలిసిన తహశీల్దార్

విశాలాంధ్ర - పార్వతీపురం : సీతానగరం తహశీల్దారుగా బాధ్యతలు చేపట్టిన ప్రసన్నకుమార్ ఎమ్మెల్యే విజయ్ చంద్రను మర్యాదపూర్వకంగా కలిసి బోకేను అందజేశారు. ప్రజలరెవెన్యూ పరమైన సమస్యలు తలెత్తకుండా సక్రమంగా విధులు నిర్వర్తించాలని ఎమ్మెల్యే తెలిపారు.